

## పంచాయతీరాజ్ చట్టంపై శిక్షణ

ప్రజాశక్తి-మండపేట

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కల్పించడంలో భాగంగా మండల పరిపాలన అధికారి విఎన్. ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శిక్షణ తరగతులు నిర్వహించారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో మండల అభివద్ధి అధికారి ఐదం రాజు మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు వాటి పరిష్కారం తడితర అంశాలతో పాటు గ్రామాల్లో జరిగే గ్రామసభల ప్రాముఖ్యత, మూడు నెలలకు ఒకేసారి జరిగే మండల సమావేశం తదితర విషయాలపై శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న రాజు

# ముంచిన మిచౌంగ్

- తీరం దాటిన తుపాను
- కొనసాగుతున్న భారీ వర్షాలు
- పంటలకు తీవ్ర నష్టం
- దెబ్బతిన్న రహదారులు
- నీటమునిగిన లోతట్టు ప్రాంతాలు
- దెబ్బతిన్న పంటను పరిశీలించిన అధికారులు,

ప్రజాశక్తి-యంత్రాంగం

*గత కొద్ది రోజులుగా రాష్ట్రానికి వణికించిన మిచౌంగ్ తుపాను మంగళవారం తీరం తాకింది. తుపాను తీరం దాటినా భారీ వర్షాలు మరో 24 గంటలు కురిసే అవకాశం ఉంది. అయితే ఈ తుపాను డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అతలాకుతలమైంది. తుపాను ప్రభావంతో జిల్లా పంటలు నీట మునిగాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. తుపాను ధాటికి జిల్లాలో రోడ్లు ధ్వంసమయ్యాయి. పలుచోట్ల కాలనీలు, లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.*

**అమలాపురం :** జిల్లాలో వరి కోతలు జోరుగా సాగుతున్న వేళ మిచౌంగ్ తుపాను రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. తుపాను ప్రభావంతో ఆదివారం సాయంత్రం నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, వీస్తున్న ఈదురు గాలులకు వరిచేలు నేలకొరిగాయి. జిల్లాలో 1.68 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేయగా 60 లక్షల ఎకరాల్లో ఇంకా వరి కోతలు పూర్తి కావాల్సి ఉంది.

### ధాన్యం మద్దతు ధరకు కొనుగోలుకు చర్యలు

మిచౌంగ్ తుపాను ప్రభావంతో రంగు మారిన తేమ శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రభుత్వపరంగా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకుచర్యలు చేపట్టిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పేర్కొన్నారు. అల్లవరం మండల పరిధిలో రెల్లు గడ్డ గ్రామంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి, తుపాను సహాయక చర్యల పర్యవేక్షణ ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, మంత్రి విశ్వరూప్ దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1లక్ష ఆయిదు వేల ఎకరాల్లో ఖరీఫ్ సీజన్ పంటలు నూర్పుళ్ళు జరిగి ధాన్యం కూడా రైస్ మిల్లులకు చేరిందన్నారు. 50వేల ఎకరాల్లో పంట ఉందని, దీనిలో 9,000 ఎకరాలు తుపాను ప్రభావంతో పంట దెబ్బతిన్నదని, అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని రైతాంగానికి గిట్టుబాటు ధరలు కల్పిస్తోందన్నారు. ప్రత్యేక అధికారి జి.జయ లక్ష్మీ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు సమర్థవంతంగా చేపట్టారని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అల్లవరం మండలంలో జలీవల కాలంలో ముంపు తొలగింపునకు రూ.ఐదు కోట్ల మేర పనులు చేపట్టామ న్నారు. వాటి ఫలితంగా నేడు రామేశ్వరం మొగదాల్లో సవ్యంగా నీరు సముద్రం లోనికి ప్రవేశిస్తుందన్నారు. తదనుగు ణంగా ఈ తుపాను వల్ల మండల పరిధిలో ముంపు ప్రభావం చాలావరకు తగ్గిందన్నారు. సుమారు తొమ్మిది వేల ఎకరాల్లో సర్వే, 1318 రకాల పంటలు నీట మునిగాయన్నారు. తుపాను సహాయక చర్యల పర్యవేక్షణ కొరకు నియమింపబడ్డ జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి మంగళవారం మంత్రి పినిపే విశ్వరూప్, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తో కలిసి స్థానిక కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ద్వారా తుపాన్ ప్రభావ స్థితిగతులను వారు తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ సిహెచ్.బాబు, కంట్రోల్ రూమ్ ఇంచార్జి సుమంత్ తదితరులు పాల్గొన్నారు.



పొలాలను పరిశీలిస్తున్న అమలాపురం రూరల్ మండలం బండారులంక సర్పంచ్ సునీత

### ఉపాధి హామీ కూలీలను తుపాను సహాయ చర్యలకు అనుసంధానం

జిల్లాలో ఉపాధి హామీ అనుసంధానంతో మిచౌంగ్ తుపాను ముంపు సహాయక చర్యలు అధికారులు చేపట్టారు. జిల్లాలో ఉపాధి హామీ కూలీల అనుసం ధానంతో నీట మునిగిన వరి పొలాల లోని నీటిని డ్రైనేజీ ద్వారా కిందకి మళ్లించి, వరి పంట క్షేత్రాలలో ఉన్న వరి పనలను సురక్షిత ప్రాంతాలకు చేర్చే పనులు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు.

### రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

కోతలు పూర్తయిన వరి పనలను వర్షాల నుంచి రక్షించుకునేందుకు కుప్పలుగా వేసే సమయంలో ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లుకుంటూ కుప్ప వేస్తే ధాన్యం పాడవకుండా ఉంటుందని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా.బి. భవాని తెలిపారు. ఈ కోత కోసి చేలల్లో ఉన్న పనలపై గింజ మొలకెత్తకుండా లీటరు నీటికి 10 గ్రాముల ఉప్పు కలిపిన ద్రావణం పిచికారీ చేయాలి. కళ్లాల్లో ధాన్యం తడిస్తే రంగుమారి, చెడు వాసన వస్తుంది. దీనిని నివారించేందుకు క్వింటా ధాన్యానికి కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలిపి ధాన్యం పోగు చేయాలి. ముంపునకు గురైన చేలల్లో పైరును పనలుగా గుదుళ్ల కట్టుకుని నిలబెడితేధాన్యం రంగు మారకుండా, మొలకెత్తకుండా ఉంటుంది. పొలాల్లో నిలిచిన నీటిని గాడులు తీయడం ద్వారా బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టాలి.

### భారీ వర్షం వల్ల ఎంపిడిఒ కార్యాలయం మునక

**ఐ.పోలవరం :** మండలంలో వివిధ గ్రామాల్లో మిచౌంగ్ తుపాను ప్రభావం వల్ల వర్షంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లన్నీ బురదమయంగా మారాయి. మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద వర్షం నీటిలో ఉండటం వల్ల కార్యాలయం సిబ్బంది,ప్రజలు కార్యాలయానికి రావటానికి ఇబ్బందిపడ్డారుప భారీ వర్షాలు వల్ల వరి పంట నేల మట్టంకావడంతో రైతులు ఆవేదన చెందు తు న్నారు. ఈదురుగాలులకు గ్రామాల్లో విద్యుత్సరఫరాకు అంతరాయం కలిగింది.

### తీరం అల్లకల్లోలం

**రాజోలు :** భారీవర్షాలకు పలు ప్రాంతాల్లో కోతకు వచ్చిన వరిచేలు నేలకొరిగాయి. పలు రహదార్లు జలమయమయ్యాయి. సఖినేటిపల్లి మండలం లో మంగళవారం ఈదురు గాలులకు విద్యుత్ స్థంబాలు నెలకొరిగాయి.ఈదురుగాలులకు చిన్న లేగదూడ మృతి చెందింది. తుపాను ప్రభావంతో అంతర్వేది, శంకరగుప్తం, చింతలమోరి తదితర గ్రామాల్లోని సముద్రతీరంలో అలలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. సముద్రపోటు ప్రభావంతో ఉప్పునీరు తీరంవైపు సుమారు 30 మీటర్ల వరకు చొచ్చుకువచ్చింది. తుఫాను ప్రభావంతో సఖినేటిపల్లి మండలం అంతర్వేది హార్బర్లో 400 ఫిషింగ్ బోట్లను నిలిపి వేశారు.

### రామచంద్రపురం నియోజకవర్గంలో..

**రామచంద్రపురం :** మిచౌంగ్ తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు ధాన్యం రాశులు నీట మునిగాయి. పామర్రు పరిసర ప్రాంతాల్లో పంట పండించిన రైతులు ఇ క్కడ హై స్కూల్ గ్రౌండ్ లో ధాన్యం రాశులుగా పోసి నిలవచేసుకున్నారు. అయితే భారీ వర్షాలకు హైస్కూల్ గ్రౌండ్లోకి నీరు చేరడంతో ధాన్యం రాశులు మొత్తం ముంపునకు గురయ్యాయి. విషయం తెలుసుకున్న రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పామర్రు హై స్కూల్ గ్రౌండ్ కు చేరుకుని తడిసిన ధాన్యం రాశులు పరిశీలించారు అనంతరం ఇక్కడ రైతులతో మంత్రి మాట్లాడారు. ఇప్పటికే మిల్లర్లకు తడిసిన ధాన్యం పై పలు సూచనలు చేశామని ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు ఎప్పుడు సిద్ధంగా ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు. ఆయన వెంట కె.గంగవరం తహశీల్దార్ వైద్యనాథ్ శర్మ పలువురు వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు. మరోవైపు రైతులు ధాన్యం ఎగుమతులు కొనసాగించారు.

### ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని ఆదేశం

**మామిడికుదురు :** మిచౌంగ్ తుపానుకు నగరంలో నేలకొరిగిన వరిపంటచేలను ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు అధికారులతో పరిశీలించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరారు. ఎంఎల్ఎ స్పందించి తేమ తో సంబంధం లేకుండా వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. మిచౌంగ్ తుఫాను వల్ల నష్టపోయిన వరి రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు డిమాండ్ చేశారు. మామిడి కుదురులో వర్షాల వల్ల నష్టపోయిన రైతులను మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు కలసి రైతుల కష్టాలను తెలుసుకున్నారు. భారీ వర్షాలతో జల మయమైన లోతట్టు ప్రాంతాలను జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ కుమారి సం దర్శించారు. నీట మునిగిన పాశర్లపూడి లో సత్రరువు తోట, కృష్ణ శర్మ కాలనీ లను పరిశీలించి ముంపునీరు మళ్లించే చర్యలు చేప్పట్టాలని ఆదేశించారు.

### నీట మునిగిన పంట పొలాల పరిశీలన

**అమలాపురం రూరల్ :** మిచౌంగ్ తుపాను కారణముగా అమలాపురం మండలం బండారులంక గ్రామంలో నీట మునిగిన వరిచేలను గ్రామ సర్పంచ్ పెనుమల సునీత మంగళవారం పరిశీలించారు. రైతులందిరికీతగిన జాగ్రత్తలు తెలియపరిచి పంట నష్టపోయిన రైతులకి ప్రభుత్వం ద్వారా వచ్చే రాయితీ అందేలా పై అధికారులకు తెలియజేస్తానని అన్నారు. కార్యక్రమంలో అమలాపురం విస్తరణ అధికారి మల్లికార్జునరావు, ఎంపిడిఒ జె.వెంకటేశ్వరరావు, మండల వ్యవసయ అధికారి ధర్మ ప్రసాద తదితరులు పాల్గొన్నారు. కామనగరువు పంచాయతీ పరిధిలోని బాలయోగి కాలనీ తదితర ముంపు ప్రాంతాలను గ్రామ సర్పంచ్ నక్క అరుణ కుమారి చంద్రశేఖర్ మంగళవారం పరిశీలించారు. తామంతా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితిలు నెలకొన్నాయని పలువురు సర్పంచ్ కు వివరించారు.ముంపు నీటిని త్వరగా బయటకు తీయాలని సర్పంచ్ పంచాయతీ సిబ్బందికి సూచించారు.

### జలమయమైన రావులపాలెం బస్టాండ్

**రావులపాలెం :** తుఫాను నేపథ్యంలో కురుస్తున్న భారీ వర్షాలకు రావులపాలెం బస్టాండ్ జలమయమైంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రావులపాలెం మండలంలోని పంట పొలాలతో పాటు పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పలు రకాల పంటలు చేలలోనే వర్షపు నీటిలో నానుతూ కనిపించాయి.

### అహర్నిశలు శ్రమిస్తున్న విద్యుత్ సిబ్బంది

**కొత్తపేట :** మిచౌంగ్ తుఫాను ప్రభావంతో విద్యుత్ సమస్యలు తీవ్రమవుతున్నాయి. బలమైన గాలులు వీస్తుండడంతో చెట్ల కొమ్మలు విరిగిపడిపోతున్నాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలు కూలుతున్నాయి.ఈ సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా మండల పరిధిలోని పలుచోట్ల కొత్తపేట విద్యుత్ శాఖ సిబ్బంది సేవలు అందిస్తున్నారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పంట చేతికొచ్చినా తుఫాన్ ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని కొత్తపేట నియోజకవర్గ టిడిపి ఇంఛార్జ్ బండారు సత్యానందరావు అన్నారు. కొత్తపేట మండలం శివారు చిన్నగూళ్ళ పాలెంలో నేలకొరిగిన పంటపొలాలను పార్టీ శ్రేణులతో కలసి పరిశీలించారు.



పామర్రులో వర్షపు నీటిలో మునిగిన ధాన్యం రాశులను పరిశీలిస్తున్న మంత్రి వేణు

## రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

### సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లాలో మిచౌంగ్ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పంట నష్టం పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తేమ శాతం చూడకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిబంధనలు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టకుండా నిబందనలను సడలించి తేమ పేరుతో కేజీలు కోత లేకుండా మొత్తం ధాన్యాన్ని రైతుల కళ్లాల్లోనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. పడిపోయిన పంటచేలకు పంట నష్టం అంచనా వేయాలని డిమాండ్ చేశారు. మిచౌంగ్ తుపాను ప్రబావావంతో కురిసిన వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారందరికి ప్రభుత్వం నిత్యావసర వస్తువులను ఉచితంగా పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పునరావస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు సౌకర్యం కల్పించాలన్నారు.

### వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు

**మండపేట :** మిచౌంగ్ తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు పట్టణ పరిధిలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టామని మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ లావణ్య అన్నారు. మిచౌంగ్ తుపాను ప్రభావంతో మండపేట, పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా మండపేట–తాపేశ్వరం, మండపేట – ఏడిద రోడ్లు చెరువులు తలపిస్తుండగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

### అరటిపంటకు అపార నష్టం

**ఆత్రేయపురం :** తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు వరి పంట నేలకొరిగి నీటిలో నానుతోంది. వర్షపు నీరు ముందుకు వెళ్లే దారి లేకపోవడంతో రైతులు తమ పంటను కాపాడుకునేందుకు ప్రత్యయము మార్గాలతో నీటిని మళ్లించు కుంటున్నారు. అరటి పంటకు అపార నష్టం వాటిల్లింది. ఈదురుగాలులకు అరటి చెట్లు నేలలుంటాయి. అలాగే పల్లవి ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి.

### నీట మునిగిన చేలను పరిశీలించిన ఆర్ డి ఒ

**ఉప్పలగుప్తం :** తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలకు నీట మునిగిన పరిచేలను అమలాపురం ఆర్డిఒ కె.కేశవవర్ధన్ రెడ్డి పరిశీలించారు. తహశీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి ఆధ్వర్యంలో యంత్రాల సాయంతో భీమనపల్లి, నంగవరం, సన్నవిల్లి ఆయకట్టులోని ముంపు నీరు తొలగింపు చర్యలు చేపట్టారు. సన్నవిల్లిలో ఆక్వా చెరువుల కారణంగా వరి చేలల్లోని ముంపు నీరు దిగడం లేదంటూ ఆ గ్రామానికి చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

### నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు

**కాట్రేనికోన :** మిచౌంగ్ తుపాను ప్రభావంతో కాట్రేనికోన మండలలో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొప్పుగుంటలో కొబ్బరి చెట్లు పడిపోవడంతో ఎన్డిఆర్ఎఫ్ సిబ్బంది చెట్లను తొలగించారు. నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను ఎలక్ట్రికల్ ఎఇ బి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది విద్యుత్ స్తంభాలను నిలబెడుతూ విద్యుత్ పునరుద్ధరణ పనులు వేగంగా చేస్తున్నారు. ఎంఎల్ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ మంగళవారం కొప్పిగుంట గ్రామంలో పర్యటించారు.

### తడిసిన ధాన్యం రాశులు

**కపిలేశ్వరపురం :** తుఫాను కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు ప్రాంతాల్లో ని చేలల్లో వేసిన వరి ధాన్యం రాసులు ,రోడ్ల వెంబడి ఆరబోసిన ధాన్యం రాశులు , తడిసి ముద్దయ్యాయి.

### నీట మునిగిన పంట పొలాల పరిశీలన

**ముమ్మిడివరం :** తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు నీట మునిగి పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించేలా కృషి చేస్తానని జెసి నుపూర్ అజయ్ హామీ ఇచ్చారు. రాజుపాలెం, అన్నంపల్లి మరియు చిన కొత్తలంక తదితర గ్రామాల్లో భారీ వర్షాలకు తడిసి నీట మినిగిన వరి పంట పొలాలను, ధాన్యం రాశులనుపరిశీలించారు. ముమ్మిడివరం ఎంఎల్ఎ పొన్నాడ సతీష్ కుమార్ సిహెచ్.గున్నేపల్లి, గాడిలంక గ్రామాల్లో పర్యటించి పంట పొలాలను ధాన్యం రాశులను పరిశీలించారు. కార్యక్రమంలో నగరపంచాయతీ ఛైర్మన్ కమిడీ ప్రవీణ్ కుమాం తదితరులు పాల్గొన్నారు.



అల్లవరం మండలం రెల్లిగడ్డ లో పంట పొలాలను పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా



కాట్రేనికోన మండలం కొప్పిగుంటలో పడిపోయినచెట్లను తొలగిస్తున్న దృశ్యం



ఉప్పలగుప్తం మండలంలో ముంపు నీరు తొలగింపునకు చర్యలు



ఐ.పోలవరం మండలపరిషత్ కార్యాలయం వద్ద చేరిన వర్షం నీరు



సఖినేటిపల్లి మండలం లో మృతి చెందిన లేగదూడ

## జిల్లా వ్యాప్తంగా నేడు పాఠశాలలకు సెలవు

ప్రజాశక్తి-అమలాపురం

మిచౌంగ్ తుపాను ప్రభావరీత్యా జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం డాక్టర్ బిఆర్ .అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అన్ని యాజమాన్య (ప్రభుత్వ/ప్రైవేటు) పాఠశాలలకు 6.12.2023 బుధవారం లోకల్ హాలీడే ప్రకటించడమైనదని జిల్లా విద్యాశాఖ అధికారి కమలకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉపవిద్యా శాఖాధికారులు మండల విద్యాశాఖా ధికారులు ఈ సమాచారాన్ని అన్ని పాఠశాలలకు తెలియజే యాలని ఆదేశించారు. ఈ విష యంలో ఏదైనా డివియేషన్ గమనించినట్లయితే అది తీవ్రంగా పరిగణించబడుతుందని డిఇఒ తెలియజేశారు.

కార్టూ'నిజం'





ఈ పథకంలో మొదటిది ఫెయిల్యూర్ సార్...
రెండోదే బాగా సక్సెస్ అవుతోంది!

## 8న దీప్తి కళాశాల్లో 'జాబ్మేళా'

ప్రజాశక్తి -మామిడికుదురు

మామిడికుదురుదీప్తి డిగ్రీ మరియు 'వికాస' కళాశాలల ఆధ్వర్యంలో డిసెంబర్ 8న శుక్రవారం 'జాబ్మేళా' నిర్వహిస్తున్నట్టు కళాశాల కరస్పాండెంట్ డివివి.సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్మేళాలో డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ(ప్రొడక్షన్), కోజెంట్ ఇ సర్వీసెస్లో బిపిఒ, డిక్సాన్, సియోన్ ఇ–హెచ్డబ్ల్యూఎ సుమిత్ మరియు ఇసుజు మోటార్స్ కంపెనీల్లో టెక్నిషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. అలాగే డిడియుజికెవై స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నారు. పై ఉద్యోగాలకు ఎస్ఎస్సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమో, బిటెక్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాల్లోపు అభ్యర్థులు అర్హులు. వీరికి నెలకు రూ.12,000 నుండి రూ.20వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులందరూ 'దీప్తి డిగ్రీ కాలేజ్, మామిడికుదురు వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్ జెరాక్స్తో హాజరుకావలెను. మరిన్ని వివరాలకు సెల్ : 94914 43264 ను సంప్రదించవలెను.

## అంగన్వాడీల సమ్మె జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-అమలాపురం

డిసెంబర్8న జరిగే అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మెను జయప్రదం చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బేబీ రాణి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అమలాపురం ఎంప్లాయిస్ హెూమ్ లో మంగళవారం జరిగిన అంగన్వాడీల విస్తత సమావేశాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఐసిడిఎస్కి నిధులు తగ్గించి అంగన్వాడీల సేవలు ప్రజలకు అందకుండా చేస్తుందని ఆమె అన్నారు. రాష్ట్రంలో వైఎస్.జగన్ ఎన్నికల ముందు తెలంగాణ కంటే అదనంగా వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి మాట తప్పారని అన్నారు. అనేక రాష్ట్రాల్లో అంగన్వాడీలకు పెన్షన్ గ్రాడ్యుటి ఇస్తుంటే మన రాష్ట్రంలో మాత్రం రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పట్టించుకోవడం దారుణమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే తీవ్రమైన పని భారం రోజురోజుకు పని భారం పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీలకు పని భారం తగ్గించాలని మినీ వర్కర్లు మెయిన్ వర్కర్లుగా చేయాలని, కనీస వేతనం రూ.26వేల ఇవ్వాలన్నారు. రకరకాల యాప్లను తీసుకొచ్చి అంగన్వాడీలపై తీవ్రమైన పని భారాన్ని పెంచిందన్నారు. హెల్పర్స్కి ప్రమోషన్ 50 ఏళ్ల వయసుకు పెంచాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశం వెంకటలక్ష్మి అధ్యక్షతన నిర్వహించగా, ఏడు ఐసిడిఎస్ ప్రాజెక్టుకు సంబంధించిన జిల్లా కమిటీ సభ్యులు సెక్టార్ లీడర్లు పాల్గొన్నారు.





అమలాపురంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బేబీ రాణి

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

ప్రభుత్వాస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ప్రజల మన్ననలను పొందాలని ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచించారు. కపిలేశ్వరపురం సిహెచ్సిలో మంగళవారం నిర్వహించిన ఆసుపత్రి అభివద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆసుపత్రి లో వార్డులను పరిశీలించి, అక్కడ అందిస్తున్న వైద్య సేవలపై రోగులను, వైద్యులను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆసుపత్రి సిబ్బంది పలు ప్రతి పాదనలను కమిటీ దష్టికి తీసుకురాగా వాటిని ఆమోదించారు. ఆసుపత్రికి సంబంధించి పలు సమస్యలపై ఎంఎల్ఎ వేగుళ్ళ చర్చిం చారు. సమా వేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ చౌదరి, ఎంపిడిఒ ఎం.రామ కృష్ణారెడ్డి, గ్రామ కార్య దర్శి కె.శివచక్రవర్తి, సర్పంచ్ సాకా శ్రీనివాస్, కాదా వెంకట రాంబాబు, కొప్పిశెట్టి వాసు, లవరెడ్డి సత్తిబాబు, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు .



సిహెచ్సిలో సమస్యలుతెలుసుకుంటున్న ఎంఎల్ఎ

## సర్పంచ్ రాముకి సన్మానం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం మండలం గున్నేపల్లి అగ్రహారం గ్రామ సర్పంచ్ పెద్దిరెడ్డి రామచంద్రరావు అమలాపురం నియోజకవర్గం సర్పంచ్ల సమాఖ్య అధ్యక్షుడిగా ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆ గ్రామ వార్డు సభ్యులు చొల్లంగి చిట్టి కనకదుర్గ శ్రీనివాసరావు మంగళవారం పంచాయతీ కార్యాలయంలో ఆయనకు శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాముకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు అనుపిండి సీతారామయ్య, కేత శ్రీలక్ష్మి, యార్లగ



సర్పంచ్ రామును సన్మానిస్తున్న వార్డు సభ్యులు

## తిరుమల భక్తులకు రుచికరమైన భోజనం కరువు : శంకరమూర్తి

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

రూ.కోట్లు డిపాజిట్ ఉన్నా తిరుమల భక్తులకు రుచికరమైన భోజనం పెట్టలేరా అని అమలాపురం మండలం బండారులంక గ్రామానికి చెందిన శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి ప్రభుత్వానికి ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దూర ప్రాంతాల నుండి తిరుమలకు వచ్చే భక్తులకు భోజనానికి ఇబ్బంది ఉండకూడదని అప్పట్లో ఎన్టిఆర్ అన్న ప్రసాదం పథకం ప్రవేశ పెడితే ఇప్పటి ప్రభుత్వం భక్తులకు రుచి కరమైన అన్న ప్రసాదం పెట్టడం లో విఫలం అయ్యిందని మండిపడ్డారు. అధికారుల నిర్లక్షం కూడా ఎక్కువగా వుందని,వారి పర్యవేక్షణ కరువైందని,వడ్డించేటప్పుడు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.సెలబ్రిటీస్ వచ్చినప్పుడు వారిపై చూపిస్తున్న శ్రద్ధ అన్న ప్రసాదం అమలు లో లేదన్నారు. దీనిపై ప్రజలు తిరగబడుతున్న తీరును చూసి ఈ ప్రకటన విడుదల చేసినట్లు తెలిపారు. భోజనం బాగోలేదని అడిగితే టిటిడి బోర్డు వాళ్ళు దురుసుగా సమాధానం చెప్పారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా భక్తులకు రుచికరమైన భోజనం సరైన పర్యవేక్షణలో పెట్టాలని డిమాండ్ చేశారు.డ్డ వెంకటేశ్వరరావు, పేరాబత్తుల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## నేరాలు ఘోరాలు

### తాళం వేసిన ఇంట్లో చోరీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన రూరల్ మండలం వలసపాకల గ్రామంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను సర్పవరం సిఐ ఆకుల మురళి కృష్ణ వివరించారు. గ్రామానికి చెందిన తిరగటి వీరభద్రరావు సాఫ్ట్ వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. తుపాన్ ప్రభావంతో విద్యుత్ కోతతో నెట్ సదుపాయం లేకపోవడంతో సోమవారం సాయంత్రం భార్యతో కలిసి గుడారి గుంట అత్తవారింటికి వెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తాళం పగల గొట్టి తలుపులు తెరిచి ఉండడడం గమనించిన ఇంటి యజమాని వీరభద్రరావు సర్పవరం పోలీసులు సమాచారం అందించారు. ఈ చోరీలో సుమారు 40 కాసుల బంగారంతోపాటు, రూ.1.50 లక్షల నగదును ఎత్తుకు పోయినట్లు కుటుంబ యజమాని తెలిపారు. సంఘటనా ప్రాంతాన్ని డిఎస్పి మురళీకృష్ణ రెడ్డి, క్రైమ్ డిఎస్పి రాంబాబు, ఐటి కోర్ శ్రీనివాస్ సందర్శించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### రెండు రేషన్ షాపుల సీజ్

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

పట్టణంలోని కుమ్మరి వీధి, ఉప్పువారి వీధుల్లో 2 రేషన్ దుకాణాలను విజిలెన్స్ ఎన్ఫోర్స్ మెంట్ దాడులు సీజ్ చేశారు. రేషన్ సరుకులను అక్రమంగా పక్కదారి పట్టిస్తున్నారని వచ్చిన ఫిర్యాదుల మేరకు ఏకకాలంలో మంగళవారం రేషన్ షాపులను తనిఖీలు చేశారు. సరుకుల నిల్వలో పెద్దఎత్తున తేడాలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. దానితో రెండు దుకాణాలను అధికారులు సీజ్ చేసి డీలర్లపై 6(ఎ ) కేసులు నమోదు చేశారు. రేషన్ సరుకులను పంపిణీ చేస్తున్న ఎండియు వాహనాన్ని అధికారులు సీజ్ చేశారు.

### విద్యుత్ షాక్‌కు గేదె మృత్యువాత

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమో..ప్రజలు, రైతుల అజాగ్రత్తతో కరెంటు తీగలు మూగజీవాల పాలిట యమపాశాలు అవుతున్నాయి. తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా వేలాడే విద్యుత్ తీగలు, ఎళ్ల తరబడి మరమ్మతులు, నిర్వహణ లేక చిన్నపాటి గాలికే తెగిపడే వైర్లు కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు ఎర్తింగ్ లోపాల కారణంగా పదుల సంఖ్యలో మూగజీవాలు కరెంట్ షాక్‌కు గురై మత్యువాత పడుతున్నాయి. మంగళవారం రూరల్ మండలం వాకలపూడి గ్రామంలో చోటుచేసుకొంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులో పెంకే అప్పారావు రైతు 6 గేదెలను మేపుతూ ఇచ్చిన పాలును అమ్మి జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే మంగళవారం గేదెలను మేతకు తోలుకెళ్లాడు. సోమవారం రాత్రి కురిసిన గాలి వాన బీభత్సానికి వాకలపూడి రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఉన్న విద్యుత్ వైర్లు తెగిపడి ఉండడాన్ని గమనించని రైతు యథావిధిగా అదే మార్గంలో గేదెలను తోలుకెళ్లాడు. ఈ క్రమంలో పాడి గేదేకు కరెంట్ షాక్ తగలి మృతి చెందింది. దీని విలువ సుమారు రూ.60 వేల వరకూ ఉంటుందని యజమాని తెలిపారు. వెటర్నరీ డాక్టర్ ఆధ్వర్యంలో మృతి చెందిన గేదెకు పంచనామా నిర్వహించారు. విద్యుత్ శాఖ తరపున ఆర్థిక సాయం అందించి తనను ఆదుకోవాలని రైతు కోరారు.

# చెరువును తలపిస్తున్న రోడ్లు



జగ్గంపేటలో చెరువును తలపిస్తున్న మెయిన్ రోడ్డు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

తుపాన్ ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. మండల కేంద్రమైన జగ్గంపేట హైవే సర్వీస్ రోడ్‌లో నీరు నిల్చిపోవడంతో ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కల్గుతోంది. సర్వీస్ రోడ్ కోసం సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న పాపాన పోవడం లేదని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. హైవే డ్రయినేజీలో పూడిక తీయకపోవడంతో మురిగినీటి ప్రవాహం లేకుండా పోయింది. దీంతో వర్షం నీరు రోడ్డుపై నిలిచిపోతుంది. గోకవరం రోడ్‌లో ఉన్న పోలవరం వంతెన మొత్తం నీటితో నిండిపోయింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి వర్షపు నీరు నిల్వ లేకుండా డ్రయిన్లలో పూడికను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

# రైతులు జాగ్రత్తలు పాటించండి

ప్రజాశక్తి - పెద్దాపురం

తుపాను కారణంగా కురుస్తున్న వర్షాల వల్ల వరి పంటకు నష్టం జరగకుండా వ్యవసాయాధికారుల సూచనలను రైతులు పాటించాలని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ సిహెచ్‌వి.నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. కోతకు సిద్ధంగా ఉన్న వరిచేలను కోయరాదన్నారు. పూర్తిగా ఆరని వరి పనలను తుపాను సమయంలో కుప్పలు వేసేటప్పుడు ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లుకుంటూ కుప్ప వేయాలని సూచించారు. కోత కోసి పొలంలో ఉన్న పనలు వర్షానికి తడిసినట్లయితే గింజ మొలకెత్తకుండా 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పిచికారి చేయాలన్నారు. కళ్లాలపై ఉన్న ధాన్యాన్ని వర్షానికి తడవకుండా భద్రపరుచు కోవాలన్నారు. నూర్చిన ధాన్యం 2-3 రోజులు ఎండబెట్టడానికి వీలు కాకపోతే కుప్పల్లో గింజ మొలకెత్తటమే కాకుండా రంగు మారి చెడు వాసన వస్తుందన్నారు. ఈ నష్టాన్ని నివారించేందుకు క్వింటాలు ధాన్యానికి ఒక కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలిపి ధాన్యం పోగు పెట్టాలన్నారు. రంగు మారిన, తడిసిన ధాన్యాన్ని బియ్యంగా కంటే ఉప్పుడు బియ్యంగా అమ్ముకుంటే కొంత మేరకు నష్టం తగ్గించవచ్చారు.

# పారదర్శకంగా ఓటర్ల జాబితా

ప్రజాశక్తి - కాకినాడ

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పారదర్శకమైన, దోష రహిత ఓటర్ల జాబితాను రూపొందించడమే లక్ష్యమని కాకినాడ సిటీ నియోజకవర్గ ఇఆర్‌ఒ, నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ- 2024 లో భాగంగా వచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కారంపై మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారం 6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తుల ప్రగతిని ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. వచ్చిన ప్రతి ఒక్క దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఓటరు ప్రత్యేక శిబిరంలో వచ్చిన దరఖాస్తులను కూడా ఎప్పటికప్పుడు వేగంగా పరిష్కరించేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈ సమావేశంలో రావూరి వెంకటేశ్వరరావు(వైసిపి), తుమ్మల రమేష్ (టిడిపి) అప్పారావు(బిఎస్‌పి), డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎఇఆర్‌ఒలు మురళీకృష్ణ, జాన్‌బాబు, హరిదాసు, నాగశాస్త్రులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంఎల్‌ఎ అక్రమాలను త్వరలోనే బహిర్గతం చేస్తా

ప్రజాశక్తి - కాకినాడ



సమావేశంలో మాట్లాడుతున్న నానాజీ

ఎంఎల్ఎ ద్వారం పూడి చంద్రశేఖర్ రెడ్డి అక్రమాలను త్వరలోనే బహిర్గతం చేస్తానని జనసేన పిఎసి సభ్యులు పంతం వెంకటేశ్వరరావు(నానాజీ) తెలిపారు. తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక వ్యక్తి విషయంలో తాను తొందరపాటులో మాట తూలిన విషయం పట్ల అప్పుడే విచారం వ్యక్తం చేశానన్నారు. తాను రైతుల కష్టాల కోసం మాట్లాడుతుంటే ఎంఎల్ఎ ద్వారంపూడి తనపై వ్యక్తిగతంగా దూషణకుల దిగుతున్నారని అన్నారు. త్వరలోనే ఆయన భాగోతాన్ని బహిరంగ పర్చేందుకు వెనకాడేది లేదన్నారు. వ్యవసాయ శాఖ మంత్రిగా కురసాల కన్నబాబు రైతుల వద్ద నుంచి కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు. తన తండ్రి ఎంతో గౌరవ మర్యాదలతో మెలిగారన్నారని, సమాజం పట్ల హుందాగా, బాధ్యతతో తమ కుటుంబం వ్యవహరిస్తుందని తెలిపారు. తాను కాంట్రాక్టులు చేసినా ఎవరినీ మోసం చేయలేదన్నారు. వైసిపి సీనియర్ నేత, ఎంపి పిల్లి సుభాష్ చంద్రబోస్, మాజీ సీఎం చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వంటి వారిపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని నానాజీ హెచ్చరించారు. ఈ సమావేశంలో తోట శ్రీరామకృష్ణ, శిరంగు శ్రీనివాసరావు, కరెడ్ల గోవిందరాజులు, పాల్గొన్నారు.

## యానాం వార్తలు

### ఓల్డేజ్ హోమ్ ద్వారా ఆహారం పంపిణీ



తుపాన్ బాధితులకు భోజనం అందిస్తున్న హోం సిబ్బంది

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆదేశాలతో గత రెండు రోజులుగా యానాం ఓల్డ్ ఏజ్ హోమ్ ద్వారా మిచౌంగ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ఆహారం పంపిణీ చేస్తున్నారు. మంగళవారం సుమారు 4000 మందికి పైగా భోజనం ఏర్పాటు చేసి ఓల్డ్ ఏజ్ హోం సిబ్బంది ద్వారా ఆయా గ్రామాల ప్రజలకు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

### కొనుగోళ్లలో నిబంధనలు సడలించాలి

ప్రజాశక్తి - కాకినాడ

ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం పెట్టిన నిబంధనలను సడలించి ధాన్యంను కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టి.నాగేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.రాజశేఖర్, సెక్రటరీ వి.రాజబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు ఓ ప్రకటనను విడుదల చేశారు. తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలకు కాకినాడ జిల్లాలో తడిసిన ధాన్యం రాశులు, పంట పొలాల్లోని పంట నీట మునిగిందని అన్నారు. పంట నీట మునగడంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.

### వికలాంగుల దినోత్సవం వాయిదా

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈ నెల 6న స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ పాఠశాల ఆవరణంలో నిర్వహించాల్సిన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం వేడుకలను తుపాన్ కారణంగా వాయిదా వేస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు శర్మ, చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. వికలాంగులు, వారి తల్లిదండ్రులు గమనించాలని, ఈ వేడుకలను ఎప్పుడు నిర్వహించేది తరువాత తెలియ చేస్తామని చెప్పారు.

## రక్షణలో నౌకాదళం కీలక పాత్ర

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

భారతదేశ సముద్ర ప్రయోజనాల రక్షణకు నిరంతరం బాధ్యతగా పనిచేస్తున్న సంస్థ నౌకా దళమని ఆ సంస్థ విశ్రాంతి అధికారి చావలి రామచంద్ర ప్రసాద్ అన్నారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో భారత నౌకా దళ వారోత్సవాల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో భారత నౌకాదళం సాధించిన విజయాలు, దేశ రక్షణలో వారి పాత్రను గుర్తించడానికి డిసెంబర్ 1 నుంచి 7 వరకు నౌక దళ వారోత్సవాలను జరుపుకుంటామని అన్నారు. సముద్ర సరిహద్దులను సురక్షితం చేయడం తోపాటు మానవతా విపత్తు ఉపశమనం మొదలైన వాటి ద్వారా భారతదేశం యొక్క అంతర్జాతీయ సంబంధాలను మెరుగుపరచడంలో నౌకాదళం పాత్ర మరువలేనిదన్నారు.

## పరికరాలకు నిధులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్



వినతిపత్రం అందిస్తున్న ప్రిన్సిపల్ చంద్రనాయుడు, రఘురామ్

స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రయోగశాలలో పరిక రాలకు నిధులు మంజూరు చేయాలని సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ బృందాన్ని కళాశాల ప్రిన్సిపల్ ఇ.చంద్రనాయుడు, కళాశాల డవలంప్‌మెంట్ కమిటీ కార్యదర్శి ఒప్పి రఘురామ్ కోరారు సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ స్వతంత్ర డైరెక్టర్ చిలుకూరి రామ్ కుమార్ సారధ్యంలో ఇతర డైరెక్టర్లు మంగళవారం కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల మౌలిక వసతులు సంతప్తికరంగా ఉన్నాయని బృందం అభిప్రాయం వ్యక్తం చేసింది. కళాశాలలో ప్రయోగ సాలలో తగిన ప్రయోగాలను నిర్వహించడానికి విద్యార్థులకు తగిన ప్రయోగపరికారాలు అందుబాటులో లేవని, కావున సిఎస్ఆర్ నుంచి నుంచి కళాశాలకు ప్రయోగశాల పరికరాల ఏర్పాటుకు మరియు కంప్యూటర్ల సరఫరా కొరకు నిధులు మంజూరు చేయలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రింటింగ్ ప్రెస్ బృందం సిద్దార్థ మన్నవ, మేనేజర్ ఎ. దుర్గాప్రసాద్, జాయింట్ జనరల్ మేనేజర్, ఎంపిడిఒ వసంతకుమార్ పాల్గొన్నారు.

# దోష రహిత ఓటర్ల జాబితా రూపకల్పన

ప్రజాశక్తి - పెద్దాపురం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ

దోష రహిత ఓటర్ల జాబితా రూపకల్పనకు అందరూ కృషి చేయాలని ఆర్‌డిఒ జె.సీతారామారావు అన్నారు. స్థానిక ఆర్‌డిఒ కారాక్యలయంలో ఆయన అధ్యక్షతన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలను ప్రతి ఒక్కరు తూచా తప్పక పాటించాలన్నారు. నూతన ఓటర్ నమోదుకు సంబంధించి 1477 అప్లికేషన్లు, మరణించిన, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారికి సంబంధించి 647, ఓటరు జాబితాలో సవరణలు, చేర్పులకు సంబంధించి 748 అప్లికేషన్లు అందాయన్నారు. ఈ అప్లికేషన్లకు సంబంధించిన వివరాలన్నీ రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. ఈ సమావేశంలో జడ్‌పిటిసి గవరసాన సూరిబాబు(వైసిపి), రంది సత్యనారాయణ(టిడిపి), నీలపాల సూరిబాబు(సిపిఎం) పాల్గొన్నారు.

### మురమండలో 'వికసిత్ భారత్ '

ప్రజాశక్తి-కడియం

మురమండ సర్పంచ్ అయినవల్లి రుక్మిణి, ఎంపిటిసి సభ్యుడు మెల్లిమి మంగా గంగరాజు అధ్యక్షతన మురమండ గ్రామంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర సభా కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా బిజెపి నాయకుడు బొరుసు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మోడీ అమలు చేస్తున్న 20 సంక్షేమ పథకాలు గురించి హాజరైన వారికి అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి కౌశల్ యోజన, అమత్ పథకం, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, బేటీ బచావో బేటి పడావో మేకింగ్ ఇండియా, స్వచ్ఛభారత్, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి విశ్వ కర్మ యోజన, మొదలగు 20 సంక్షేమ పథకాల గురించి వివరించారు. లబ్ధిదారులకు గ్యాస్ స్టౌవ్‌లు, ఆయుష్మాన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మురమండ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ప్రధానోపాధ్యాయురాలు బొండాడ సుధ ఆధ్వర్యంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. మండల ఉద్యాన అధికారి సుధీర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పద్మావతి వెలుగు ఎపిఎం నీలి సూరిబాబు, సిసి స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు,

### నీట మునిగిన ఆనంద నిలయం

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్లలో మిచౌంగ్ తుపాను కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు స్థానిక ఆనంద నిలయం బిల్డింగ్ నీట మునిగింది. దీంతో విద్యార్థులు కూర్చోవడానికి కూడా చోటు లేక నిలబడే ఉన్నారు. స్థానికుల సకారంతో దగ్గరలో ఉన్న ఎంపిపి పాఠశాల నెం (1) కు విద్యార్థులను తరలించారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నప్పటికీ సంబంధిత భవనాన్ని పునర్నిర్మాణం చేయకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నోసార్లు ఈ సమస్యను ప్రజాప్రతినిధులకు, స్థానిక ఎంఎల్ఎ తలారివెంకట్రావుతోపాటు జిల్లా అధికారులందరి దృష్టికి తీసుకువెళ్లనని, వాట్సాప్ ద్వారా తెలియజేయడమే కాకుండా గ్రూపుల్లో సైతం పోస్ట్ చేయగా యంత్రాంగం అంతా చూశారని వార్డెన్ కె.ధర్మయ్య అన్నారు. ఎవరు ఇప్పటివరకు స్పందించ లేదన్నారు. తద్వారా ఇలాంటి పరిస్థితిని బట్టి వేరే విద్యార్థులు ఇక్కడ జాయిన్ అయ్యేందుకు ఇష్టపడడం లేదు అని తెలిపారు.

### విద్యుత్ సరఫరా లేక అవస్థలు

ప్రజాశక్తి-ఉండ్రాజవరం

మిచౌంగ్ తుపాను బీభత్సానికి తోడు మండల ప్రజలకు రెండు రోజులుగా విద్యుత్ సరఫరా కూడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. భారీ వర్షం, గాలులకుకమ్యూనికేషన్ వ్యవస్థ దాదాపు కుంటుపడిపోయింది. మండల విద్యుత్ శాఖలో సిబ్బంది కొరత ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఉన్న సిబ్బంది ఎప్పటికప్పుడు తెగిపోయిన లైన్లను రిపేర్ చేసి, సరఫరా పునరుద్ధరింప చేస్తున్న ప్పటికీ, మండలం మొత్తం ఒకేసారి ఇబ్బంది ఏర్పడటంతో, గ్రామాల ప్రజలు లైన్మెన్లు లేకపోవడంతో ఎవరికి మొరపెట్టుకోవాలో తెలియక చీకట్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. దీనికి తోడు నిడదవోలు ప్రాంతంలో టోర్నడోలు కూడా బీభత్సం సష్టించడంతో ప్రజలకు ఏం చేయాలో పాలుపోని పరిస్థితి నెలకొంది.



కార్యక్రమంలో పాల్గొన్న నాయి బ్రాహ్మణ సంఘ సభ్యులు

### నాయీ బ్రాహ్మణ సంఘ వన సమారాధన

ప్రజాశక్తి-రామచంద్రపురం

నియోజవర్గంపరిధిలో నాయీబ్రాహ్మణ సంఘం వనసమారాధన కార్యక్రమం మంగళవారం ద్రాక్షారామలో నిర్వహించారు ముఖ్యఅతిథిగా నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఆచంట సుబ్బారావు పాల్గొని ప్రసంగించారు. నాయీబ్రాహ్మణ సంఘం అభివద్ధికి బలోపేతానికి సంఘ సభ్యులంతా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎపి ఐడిసి డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, మండల కో ఆప్షన్ సభ్యులు అహ్మద్ అలీషా, మాజీ ఎంపిటిసి సభ్యులు దడాల రవికుమార్, నాయీ బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు చింతలపూడి సత్తిబాబు, సెక్రటరీ సుందరపల్లి వెంకటేశ్వరరావు, రామచంద్రపురం టౌన్ అధ్యక్షులు జగన్నాథం, మాజీ అధ్యక్షులు దండకడియల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ

ప్రజాశక్తి-కాట్రేనికోన

ఉపాధి హామీ చట్టంలో భాగంగా పంచాయతీ రాజ్, మరియు పెన్షన్లపై 15వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపిపి-2 సానబొయిన నాగేశ్వరావు అధ్యక్షతన నిర్వహించారు. ఉపాధి హామీ చట్టంలో భాగంగా చేసిన పనుల వివరాలు, చెల్లింపులు, జాబ్‌కార్డు ద్వారా చెల్లింపులు, వేతనాలు సక్రమంగా అందుతున్నాయా, పెన్షన్లలో ఎక్కడ అయినా లోపాలు ఉన్నాయా వంటి అంశాలు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. సిబ్బంది భాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, జిల్లా విజిలెన్స్ అధికారి భీమేశ్వర రావు, అంబుడ్స్ మెన్ జ్యోతి, డిఆర్‌డిఎ డిపిఎం అన్నపూర్ణ, ఎంపిడిఒ కె.కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ల సవరణ, నమోదుపై సమీక్ష

ప్రజాశక్తి-మండపేట

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఓట్ల సవరణ, ఓట్ల నమోదు తదితర అంశాలపై శని, ఆదివారాల్లో జరిగిన స్పెషల్ క్యాంపన్లో వచ్చిన దరఖాస్తులపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులతో మండపేట అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి ఎస్.సుధాసాగర్ మంగళవారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు, పలు పార్టీల రాజకీయ నాయకులతో పాటు మున్సిపల్ కమిషనర్ టి.రాముకుమార్, తహశీల్దార్ టిఆర్.రాజేశ్వరరావు, మండల పరిపాలన అధికారి విఎన్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

# ఇండియన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో అభిషేక్ ప్రతిభ

ప్రజాశక్తి-రామచంద్రపురం



రన్నర ట్రోఫీతో బోస్ అభిషేక్

బెంగళూరు వేదికగా జరిగిన కర్ణాటక బ్యాడ్మింటన్ అసోసియేషన్‌లో మోడరన్ విద్యార్థి బోస్ అభిషేక్ ప్రతిభను చాటాడు. నవంబర్ 28 నుంచి డిసెంబర్ 5 వరకు జరిగిన యోనెక్స్-సన్ రైజ్ ఆల్ ఇండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ బాడ్మింటన్ టోర్నమెంట్-2023లో పట్టణానికి చెందిన మోడరన్ హైస్కూల్ విద్యార్థి బోను అభిషేక్ అండర్-15 డబుల్స్ కేటగిరీ నందు ఆల్ ఇండియా లెవెల్‌లో ద్వితీయస్థానం సాధించి రన్నర్ గా నిలిచినట్లు మోడరన్ విద్యాసంస్థల అధినేత లయన్ జివి.రావు తెలిపారు. ఈ సందర్భంగా రావు మాట్లాడుతూ అభిషేక్ రూ.15 వేలు నగదు పురస్కారంతో పాటు ప్రముఖుల చేతుల మీదుగా ట్రోఫీ తీసుకున్నారని వివరించారు. అభిషేక్ మరో విజయాన్ని దక్కించుకోవడం సంతోషదాయకం అని అన్నారు. మోడరన్ హైస్కూల్ అకడమిక్ డైరెక్టర్ ఆర్.ఉమాదేవి మాట్లాడుతూ విజయమే లక్ష్యంగా ప్రతీ టోర్నమెంట్ నందు ప్రతిభ చూపుతున్న అభిషేక్ భవిష్యత్‌లో దేశం గర్వించే గొప్ప క్రీడాకారుడు కావడం తథ్యమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అభిషేక్ మాట్లాడుతూ తన వరుస విజయాల పరంపరకు వెన్నుదన్ను గా నిలుస్తున్న అంశాలు తల్లిదండ్రుల విశేషమైన ప్రోత్సాహంతో పాటు తన ప్రతిభకు మద్దతుగా నిలుస్తున్న మోడరన్ కరస్పాండెంట్ జివి.రావు అని ధన్యవాదాలు తెలిపాడు. ఈ సందర్భంగా అభిషేక్‌కు హెచ్.ఎం.ముత్యాల చిట్టిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.



### నేడు కుల గణనపై సమావేశం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండల పరిషత్ కార్యాలయంలో కులగణనపై అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎం.రామకష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన జరిగే సమావేశానికి జెడ్‌పిటిసి సభ్యులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, తహశీల్దార్, మండల స్థాయి అధికారులు, సచివాలయాల వెల్ఫేర్స్, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలన్నారు.

### సమస్యలపై పోరాడే వారికి అండగా జనసేన

ప్రజాశక్తి-గోకవరం

సిఎం జగన్ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ముఖ్యమైన హామీ ప్రతి పేదవానికి ఇంటి స్థలం కేటాయించి, ఇల్లు నిర్మించి ఇస్తానని జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి పాఠంశెట్టి సూర్యచంద్ర అన్నారు. కానీ ఇది ఎక్కడా ఆచరణలో మాత్రం సాధ్యం కావట్లేదన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఎవరు పోరాడినా వారికి జనసేన పార్టీ అండగా ఉంటుందన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగున్నర ఏళ్లు గడిచిపోయినా గోకవరంలో ఇళ్ల స్థలాలను గుర్తించలేదన్నారు. ఈ ఇళ్ల స్థలాల సమస్యపై జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టామని, అధికారులకు వినతి పత్రాలు అందజేశామన్నారు. కానీ ఇప్పటివరకు అధికారులు గాని, ప్రజా ప్రతినిధులు గాని ఈ సమస్యపై స్పందించలేదన్నారు. ఇదే సమస్యపై అధికార పార్టీ గోకవరం మండల ఎంపిపి సుంకర శ్రీవల్లి, సుంకర వీరబాబు మీడియా ముఖంగా అధికారులను ప్రశ్నించడం అభినందనీయమన్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ నాయకులు ఈ సమస్యపై స్పందించి పేదలకు ఇళ్ల స్థలాలను అందించాలన్నారు.



అరటి గెల

### అబ్బురపరుస్తున్న ఏడు అడుగుల అరటి గెల

ప్రజాశక్తి-ఆత్రేయపురం

సాధారణంగా అరటి గెల రెండు అడుగుల నుంచి మూడు అడుగుల వరకు ఉంటుంది. ఉచ్చిలి గ్రామానికి చెందిన భూపతి రాజు సుబ్బరాజు తన పొలంలో సేంద్రియ ఎరువులతో పెంచిన అరటి చెట్టు ఏడడుగులు భారీ స్థాయిలో అరటి గెల వేయడంతో అందరిని అబ్బురపరుస్తోంది. జన్య పరివర్తన చెందటంతో పాటు భూమి లో సారవంతం ఎక్కువైనప్పుడు భారీ స్థాయిలో అరటి గెలల వేస్తాయని ఉద్యాన అధికారులు చెబుతున్నారు.